RNI NO :Title-Code :-TELTEL02102

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దినపత్రిక

అనుక్షణం ప్రజలపక్షం...

సంపుటి - 1 సంచిక - 152 శనివారం 24 ఫిబ్రవరి 2024 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Districts


## మలుపు తిరిగిన లిక్కర్ కేసు

: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను నిందితురాలిగా మార్చిన సీబీఐ..
విచారణకు రావాలని సమన్లు

2లో.


WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త దిన పత్రికలో పనిచేయుటకు
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా, మండల, కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను.
ఎడిటర్ : బిర్రు కరుణాకర్
Cell: 9701249103


# 27 నుంచి ఉచిత విద్యుత్, గ్యాస్ పథకాలు అమలు

: సమ్మక్క సారక్కలంటేనే పోరాట స్ఫూర్తి
: మేడారంలో సీఎం రేవంత్ రెడ్డి



**ఫిబ్రవరి 23(జర్నలిస్ట్ వార్త):**
ఈ నెల 27 వ తేదీ సాయంత్రం రెండు గ్యారెంటీలు ప్రారంబించనున్నట్లు రేవంత్ రెడ్డి ప్రకటించారు.. మేడారంలో ఆయన మీడియాలో మాట్లాడుతూ, సమ్మక్క సారక్కలంటేనే పోరాట స్ఫూర్తి అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అమరులై దేవతలుగా వెలిసారని చెప్పారు. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆ దేవతలను కోరుకున్నానని తెలిపారు. మేడారం మహా జాతర సమ్మక్క సారలమ్మ పండుగ సంధర్భంగా శుక్రవారం ముఖ్య మంత్రి అమ్మవారికి నిలువెత్తు బంగారం (బెల్లం), పసుపు కుంకుమ, గాజులు, సమర్పించారు. తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్యమంత్రితో పాటు మంత్రులు సీతక్క, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దుద్దిల్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్ మురళి నాయక్, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, జాతర ప్రత్యేక అధికారులు శరత్, ఆర్వీ కర్ణన్, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఐటీడీఏ పీవో అంకిత్, ఎస్పీ శబరిష్ తదితరులు ఉన్నారు.
అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ముఖ్యమైన ఏ కార్యక్రమం తీసుకున్న ఇక్కడి నుంచే మొదలు పెట్టామని చెప్పారు. హాత్ సే హాత్ జోడో యాత్ర ఇక్కడి నుంచే ప్రారంభించామని అన్నారు. ఇక రూ 500 లకే పేద మహిళలకు గ్యాస్ సిలిండర్ , 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాలను ఆ రోజు నుంచి అమలు చేయనున్నట్లు చెప్పారు..ఈ రెండు గ్యారెంటీలు ప్రారంభానికి ముఖ్య అతిధిగా హాజరవుతున్న కాంగ్రేస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ హాజరవుతున్నట్లు వెల్లడించారు..





# వెంటాడిన మృత్యువు


- బీఆర్ఎస్ ఎమ్మెల్యే లాస్య నందిత కన్నుమూత
- రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన యువ ఎమ్మెల్యే
- హైదరాబాద్ ఓఆర్ఆర్‌పై ప్రమాదానికి గురైన ఆమె కారు
- అక్కడికక్కడే ప్రాణాలు మృతి



నివాళులు అర్పించిన సీఎం రేవంత్ రెడ్డి

**ఫిబ్రవరి 23(జర్నలిస్ట్ వార్త):**
తీవ్ర విషాద ఘటన చోటుచేసుకుంది. సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో చనిపోయారు. ఆమె ప్రయాణిస్తున్న కారు హైదరాబాద్ ఓఆర్ఆర్‌పై ప్రమాదానికి గురయ్యింది. ఈ ఘోర ప్రమాదంలో ఎమ్మెల్యే అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఆమె పీఏ ఆకాశ్ తీవ్రంగా గాయపడ్డారని తెలుస్తోంది. సమాచారం అందకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. ప్రమాద తీవ్రతకు ఆమె కారు ముందు భాగం తీవ్రంగా దెబ్బతింది. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.లాస్య నందిత ఇటీవలే ఓ రోడ్డు ప్రమాదం నుంచి బయటపడ్డారు. స్వల్ప గాయాలతో బయటపడ్డారు. బీఆర్ఎస్ కార్యానిర్వహక అధ్యక్షుడు కేటీఆర్ స్వయంగా ఆమె ఇంటికి వెళ్లి అప్పుడు పరామర్శించారు కూడా. కొన్ని రోజుల్లో మళ్లీ ఆమె రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందడం విషాదంగా మారింది. ఇక దివంగత మాజీ ఎమ్మెల్యే సాయన్న కూతురే లాస్య నందిత. ఆయన చనిపోవడంతో బీఆర్ఎస్ లాస్య నందితకు సీటు ఇచ్చి పోటీ చేయించింది.

మిగతా 2లో.



# బీబీసీ చైర్మన్ గా భారత సంతతి వ్యక్తి సమీర్ షా

భారత సంతతి వ్యక్తికి బ్రిటన్ లో ఉన్నత పదవి
బీబీసీ చైర్మన్ గా నాలుగేళ్ల పాటు
కొనసాగనున్న సమీర్ షా

2లో.

# తెలంగాణలో పలువురు ఐఏఎస్ ల బదిలీ

**ఫిబ్రవరి 23(జర్నలిస్ట్ వార్త):**
పలువురు ఐఏఎస్ అధికారులను తెలంగాణ ప్రభుత్వం బదిలీ చేసింది. సిద్దిపేట కలెక్టర్ గా ఉన్న ప్రశాంత్ జీవన్ పాటిల్ నీటి పారుదల శాఖ ప్రత్యేక కార్యదర్శిగా బదిలీ చేశారు. సిద్దిపేట కలెక్టర్ గా మిక్కిలినేని మను చౌదరిని నియమించారు. మను చౌదరి ప్రస్తుతం కామారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ గా ఉన్నారు. వరంగల్ మున్సిపల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషాను జనగాం జిల్లా కలెక్టర్ గా బదిలీ చేశారు. పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల శాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్న శైలజా రామయ్యర్ కు రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి బాధ్యతలను అదనంగా అప్పగించింది. ఇప్పటి వరకు ఈ బాధ్యతలను అదనపు హోదాలో చూస్తున్న సునీల్ శర్మను ఈ బాధ్యతల నుంచి రిలీవ్ చేసింది. వరంగల్ జిల్లా కలెక్టర్ శివలింగయ్యను సాధారణ పరిపాలన శాఖలో రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశించింది.

# మేడారం వనదేవతలను దర్శించుకున్న గవర్నర్

## - ఘనంగా స్వాగతించిన మంత్రులు, ఎమ్మెల్యేలు



మేడారం, ఫిబ్రవరి 23(జర్నలిస్ట్ వార్త): రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళసై సౌందరరాజన్, కేంద్ర గిరిజన శాఖ మంత్రి అర్జున్ ముండా శుక్రవారం మేడారం జాతరకు చేరుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే ఈటెల రాజేందర్, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ములుగు ఎస్పి శబరీష్, అదనపు కలెక్టర్ శ్రీజ ప్రత్యేక అధికారులు వారికి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గవర్నర్ తో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు అమ్మవార్లను దర్శించుకున్నారు. జాతర ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో గవర్నర్ మాట్లాడుతూ వన దేవతలైన సమ్మక్క సారలమ్మ అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకోవడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. గతంలో మేడారం జాతర సందర్శించి మొక్కులు చెల్లించుకున్న సందర్భాలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రతిసారి జాతరలో పాల్గొన్న భక్తుల సంఖ్య ఈసారి అధికంగా పెరిగిందని చెప్పారు. కేంద్రమంత్రి అర్జున్ ముండా మాట్లాడుతూ దేశంలోనే మేడారం జాతర అతిపెద్ద ఆదివాసి జాతర అన్నారు. మేడారం జాతరను ట్రైబల్ ఫెస్టివల్ జాతరగా జరిపేందుకు ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. వారి వెంట ప్రత్యేక అధికారులు కృష్ణ ఆదిత్య,అర్.వి.కర్ణన్, శరత్, ఇతరాత్ర శాఖల ఉన్నత అధికారులు, పోలీస్ అధికారులు తదితరులు ఉన్నారు.

# మెట్రో రైలు విస్తరణ...

## జపాన్ తో ప్రభుత్వం సంప్రదింపులు

**ఫిబ్రవరి 23(జర్నలిస్ట్ వార్త):**
హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణ పనులకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. మొత్తం ఆరు మార్గాల్లో 70 కిలోమీటర్ల మేర మెట్రో విస్తరణ పనులను చేపడుతోంది. ఈ పనులకు భారీగా నిధుల అవసరం ఉంది. ఈ నేపథ్యంలో జపాన్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్ ఏజెన్సీ (జైకా)తో రాష్ట్ర ప్రభుత్వం సంప్రదింపులు జరుపుతోంది. ప్రాథమిక అంచనాల ప్రకారం మెట్రో విస్తరణ పనులకు రూ. 17,500 కోట్ల వరకు ఖర్చు అవుతుంది. సాధారణంగా ఇలాంటి ప్రాజెక్టులకు రాష్ట్ర ప్రభుత్వం 35 శాతం, కేంద్ర ప్రభుత్వం 15 శాతం నిధులను వెచ్చిస్తాయి. మిగిలిన 50 శాతం నిధులను రుణాల రూపంలో సమకూర్చుకుంటారు. అయితే, ఈసారి రాష్ట్ర ప్రభుత్వం కొత్త మోడల్ వైపు మొగ్గు చూపుతోంది. 50 శాతంలో 5 శాతాన్ని ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ)కు అవకాశం ఇవ్వబోతోంది. మిగిలిన 45 శాతం నిధులను దీర్ఘకాలానికి రుణం తీసుకోవాలని యోచిస్తోంది.
ఈ క్రమంలో జైకా ఇండియా చీఫ్ ప్రతినిధులతో ముఖ్యమంత్రి రేవంత్, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క,



ఉన్నతాధికారులు చర్చలు జరిపారు. చెన్నై, ముంబై, కోల్ కతా, ఢిల్లీ, బెంగళూరు, పాట్నా, అహ్మదాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టులకు కూడా జైకా రూ. 1.07 లక్షల కోట్ల రుణాలను మంజూరు చేసింది. జైకా ఇచ్చే రుణాలకు వడ్డీ 2, 3 శాతానికి మించదని అధికారులు చెపుతున్నారు.

జర్నలిస్ట్ వార్త
RNI NO :Title-Code :-TELTEL02102
అనుక్షణం ప్రజాపక్షం... తెలుగు దినపత్రిక



# అధికార లాంఛనాలతో

## ఎమ్మెల్యే లాస్య అంత్యక్రియలు.. ప్రముఖుల సంతాపాలు

**ఫిబ్రవరి 23(జర్నలిస్ట్ వార్త):**

రోడ్డు ప్రమాదంలో కన్నుమూసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే లాస్య నందిత అంత్యక్రియలు సికింద్రాబాద్ లోని ఈస్ట్ మారేడ్ పల్లి హిందూ శ్మశాన వాటికలో ముగిశాయి. సికింద్రాబాద్ లోని కంటోన్మెంట్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న లాస్య నందితకు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.
తమ పార్టీ మహిళా నేతకు కడసారి వీడ్కోలు పలికేందుకు బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలివచ్చాయి. పార్టీ అగ్రనేతలు తన్నీరు హరీశ్ రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, పల్లా రాజేశ్వర్ రెడ్డి, పాడి కౌశిక్ రెడ్డి తదితరులు అంత్యక్రియలకు హాజరయ్యారు. పోలీసులు గౌరవ వందనంగా తుపాకులను గాల్లోకి పేల్చారు.

### ప్రముఖుల సంతాపాలు..

కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత మృతిపై హరీశ్ రావు, ఏపీ మాజీ సీఎం చంద్రబాబు సహా పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు. ఆమె మృతిపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎంతో రాజకీయ భవిష్యత్తు కలిగిన కంటోన్మెంట్ యువ ఎమ్మెల్యే లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందడం ఎంతో బాధాకరమని హరీశ్ రావు అన్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

### చంద్రబాబు సంతాపం

తండ్రి సాయన్న చనిపోయిన ఏడాదిలోపే లాస్య నందిత మృతి చెందడం దురదృష్టకరమని ఏపీ మాజీ సీఎం చంద్రబాబు అన్నారు. ఆమె ముందు ఉజ్వల భవిష్యత్తు ఉండగా, విధి మరొకటి తలచిందన్నారు. లాస్య నందిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

చిన్న వయసులోనే ఎమ్మెల్యేగా గెలుపొందిన లాస్య మృతి ఎంతో బాధ కలిగించిందని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. ఆమె కుటుంబ సభ్యులకు ఆ భగవంతుడు మనోధైర్యం కలిగించాలని ఆకాంక్షించారు.

**- శాసన మండలి చైర్మన్ గుత్తా..**

లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో మృతి చెందారన్న వార్త తెలుసుకుని తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాను. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి. చిన్న యయసులోనే ఎమ్మెల్యేగా గెలిచిన లాస్య.. మూడు నెలల్లోనే ఇలా అందరికీ దూరం అవుతుందని అనుకోలేదు.

**తలసాని శ్రీనివాస్ యాదవ్**

చిన్న వయస్సులోనే కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా ఎన్నికై మంచి రాజకీయ భవిష్యత్తు ఉండి, తన తండ్రి దివంగత మాజీ ఎమ్మెల్యే సాయన్న ఆశయాలను ముందుకు తీసుకుపోతూ అందరి మన్ననలు పొందుతున్న లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం అత్యంత బాధాకరం. సంవత్సరం క్రితం వారి తండ్రి సాయన్న మరణం, ఇప్పుడు కూతురు నందిత అకాల మృత్యువుకు లోనుకావడం విచారకరం. ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాను. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిజేస్తున్నాను.

**- ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి**

లాస్య నందిత మరణం కంటోన్మెంట్ ప్రజలకు, బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటు.

**- వేముల ప్రశాంత్ రెడ్డి**

చిన్న వయసులోనే ఎమ్మెల్యేగా ఎన్నికై.. తన తండ్రి, దివంగత ఎమ్మెల్యే సాయన్న ఆశయాలను ముందుకు తీసుకుపోతూ అందరి మన్ననలు పొందిన నందిత అకాల మరణం తీవ్ర బాధాకరం. ఏడాది క్రితం సాయన్న మరణం, ఇప్పుడు ఆయన కూతురు మృతి చెందడం విచారకరం

**- ఎంపీ వద్దిరాజు రవిచంద్ర**

లాస్య నందిత అకాల మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆమె కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి. లాస్య గొప్ప భవిష్యత్ ఉన్న యువ నాయకురాలు. ప్రజల మద్దతుతో ఎన్నికై ఇలా అకాల మరణం చెందడం ఎంతో బాధాకరం. ఆమె ఆత్మకు శాంతి కలగాలి.

**- మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి**

## లాస్య నందిత భౌతిక కాయానికి
# నివాళి అర్పించిన కేసీఆర్

**ఫిబ్రవరి 23(జర్నలిస్ట్ వార్త):**



రోడ్డు ప్రమాదంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే లాస్య నందిత ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఆమె భౌతికకాయానికి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నివాళి అర్పించారు. హైదరాబాద్ కారా?నాలోని నందిత నివాసానికి వెళ్లిన కేసీఆర్... ఆమె భౌతికకాయంపై పుష్పగుచ్ఛం ఉంచి అంజలి ఘటించారు. అనంతరం నందిత తల్లి, మాజీ ఎమ్మెల్యే సాయన్న భార్య, ఇతర కుటుంబ సభ్యులను కేసీఆర్ పరామర్శించారు. ఈ సందర్భంగా కేసీఆర్ వెంట హరీశ్ రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్ తదితరులు ఉన్నారు. అంతకు ముందు ట్విట్టర్ వేదికగా కేసీఆర్ స్పందిస్తూ... రోడ్డు ప్రమాదంలో నందిత మరణించడం ఎంతో బాధాకరమని చెప్పారు. పిన్న వయసులోనే ఎమ్మెల్యేగా గెలుపొందిన లాస్య ప్రజల మన్ననలు పొందారని అన్నారు. కష్టకాలంలో వారికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని చెప్పారు

## నివాళులు అర్పించిన సీఎం రేవంత్ రెడ్డి



లాస్య నందిత భౌతిక కాయానికి సీఎం రేవంత్ రెడ్డి నివాళులు అర్పించారు. తీవ్ర విషాదంలో ఉన్న లాస్య నందిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అటు, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కూడా లాస్య నందిత భౌతిక కాయానికి నివాళులు అర్పించారు.

# ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు సర్వం సిద్ధం



**ఫిబ్రవరి 23(జర్నలిస్ట్ వార్త):**

రాష్ట్రంలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నిర్వహణకు ఇంటర్ బోర్డు సర్వం సిద్ధం చేసింది. ఈనెల 28 నుంచి మార్చి 19వ తేదీ వరకు ఇంటర్ వార్షిక పరీక్షలు జరగనున్న సంగతి తెలిసిందే. ఈ పరీక్ష నిర్వహణకు ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 1,521 పరీక్షా కేంద్రాలను ఇంటర్ బోర్డు ఏర్పాటు చేసింది. ఈనెల 28 వ తేదీ నుండి మార్చ్ 19వ తేదీ వరకు జరుగ నున్న ఇంటర్మీడియట్ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టినట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలిపారు.
రాష్ట్రంలో జరుగనున్న ఇంటర్మీడియట్, పదవ తరగతి పరీక్షల సన్నద్ధత పై జిల్లా కలెక్టర్లు, జిల్లా పోలీస్ అధికారులు, విద్యా శాఖాధికారులు, సంబంధిత అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నేడు సాయంత్రం నిర్వహించారు. ఇంటర్ పరీక్షలపై ఇటీవల సిఎస్ శాంతి కుమారి ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని ఆదేశించిన విషయం తెలిసిందే. ఇంటర్ పరీక్షలలో మొదటి, రెండవ సంవత్సరాలకు సంబంధించి సుమారు 9.80 లక్షల మంది విద్యార్థులు హాజరుకానున్నారు. పరీక్షా కేంద్రాలలోనికి ఉన్నతాధికారులతో సహా ఏ ఉద్యోగి కూడా సెల్‌ఫోన్‌లను తీసుకెళ్లడం నిషేధించినట్టు సిఎస్ స్పష్టం చేశారు. పరీక్షా ప్రశ్నా పత్రాలను స్ట్రాంగ్ రూమ్‌లకు లేదా మూల్యాంకన కేంద్రాలకు తీసుకెళ్లేటప్పుడు పటిష్టమైన బందోబస్తు ఉండాలని తెలిపారు. ఏ విధమైన పరీక్షా పత్రాలు లీక్ అవ్వకూడదని రాష్ట్ర ముఖ్యమంత్రి పలుమార్లు హెచ్చరించిన విషయాన్ని గుర్తు చేస్తూ, పరీక్షా పేపర్ల తరలింపుపై జిల్లా స్థాయిలో సంబంధిత పోలీస్ ఉన్నతాధికారులకు సూచించారు. ప్రతీ పరీక్షా కేంద్రంలో సిసిటివి కెమెరాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాలలో ఉన్న పరీక్షా కేంద్రాల వద్ద ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

# గ్రూప్-1 దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం

### మార్చి 14తో ముగియనున్న గడువు

**ఫిబ్రవరి 23(జర్నలిస్ట్ వార్త):**

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఇటీవల కొత్తగా విడుదల చేసిన గ్రూప్-1 దరఖాస్తుల ప్రక్రియ శుక్రవారం(ఫిబ్రవరి 23) ప్రారంభమైంది. మార్చి 14వ తేదీ సాయంత్రం 5 గంటలకు దరఖాస్తు గడువు ముగియనుంది. అర్హులైన అభ్యర్థులు టిఎస్‌పిఎస్‌సి అధికారిక వెబ్‌సైట (https://www.tspsc.gov.in )ను ద్వారా గ్రూప్-1 పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు. గతంలో గ్రూప్-1 దరఖాస్తు చేసిన అభ్యర్థులు సైతం మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిందేనని టిఎస్‌పిఎస్‌సి స్పష్టం చేసింది.
గత నోటిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకున్న వారికి ఫీజు నుంచి మినహాయింపు కల్పించింది. 563 పోస్టులతో ఇటీవల టిఎస్‌పిఎస్‌సి గ్రూప్-1 నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. కాగా, గత ప్రభుత్వం 2022లో 503 గ్రూప్-1 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి రెండుసార్లు ప్రిలిమ్స్ పరీక్షలు నిర్వహించింది. ఒకసారి పేపర్ లీక్ అవడం కారణంగా, మరొకసారి నిర్వహణ లోపం కారణంగా రెండుసార్లు నిర్వహించిన ప్రిలిమ్స్ పరీక్షలు రద్దయిన విషయం తెలిసిందే. అయితే, ప్రస్తుత ప్రభుత్వం గత నోటిఫికేషన్‌లోని 503 పోస్టులకు మరో 60 పోస్టులను కలిపి కొత్తగా 563 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చింది. అయితే, వరుసగా రెండుసార్లు పరీక్ష రద్దు కావడం, రెండేళ్లు ముగియడంతో.. వయో పరిమితిని 44 ఏళ్ల నుంచి 46 ఏళ్లకు పెంచింది. దీంతో 46 ఏళ్ల వరకు అభ్యర్థులు ఈ గ్రూప్ 1 పోస్టులకు దరఖాస్తులు చేసుకోవచ్చు. గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షను మే లేదా జూన్ నెలలో నిర్వహించనున్నట్లు టిఎస్‌పిఎస్‌సి తెలిపింది. మెయిన్ పరీక్షలను సెప్టెంబర్, అక్టోబర్‌లో నిర్వహించనున్నారు.

# మలుపు తిరిగిన లిక్కర్ కేసు

### : బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను నిందితురాలిగా మార్చిన సీబీఐ.. విచారణకు రావాలని సమన్లు




**ఫిబ్రవరి 23(జర్నలిస్ట్ వార్త):**

ఢిల్లీ లిక్కర్ స్కాంలో కల్వకుంట్ల కవితకు నిందితరాలిగానే గుర్తించి నోటీసులు జారీ చేసింది.గతంలో సాక్షిగా నోటీసులు ఇచ్చారు. కానీ ఇప్పుడు నిందితురాలిగా చేర్చినట్లుగా కోర్టుకు తెలిపారు.41ఏ కింద నోటీసులు ఇచ్చారు. గతంలో సీబీఐ అధికారులు విచారణ ముగించుని వెళ్తూ కవితకు మరో నోటీసు ఇచ్చారు. ధ్వంసం చేసిన ఫోన్లు.. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌కు సంబంధించిన డాక్యుమెంట్లు ఇవ్వాలని ఆ నోటీసులో ఉంది. ఇవి ఆ కేసులో సాక్ష్యాల కిందకు వస్తాయి. ఆమె వద్ద ఖచ్చితంగా ఉన్నాయని నిరూపణ చేసుకునే సీబీఐ ఈ నోటీసులు జారీ చేసింది.మళ్లీ విచారణ ఎప్పుడు అన్నది గత విచారణలో సీబీఐ తేదీ ఇవ్వలేదు. త్వరలోనే అని సమాచారం ఇచ్చారు. అయితే ఇప్పటి వరకూ మళ్లీ విచారణకు పిలవలేదు. ఈ మధ్య కాలంలో చాలా మంది నిందితులు అప్రూవర్లుగా మారారు. వారు ఇచ్చిన స్టేట్‌మెంట్ల ఆధారంగా మరిన్ని ఆధారాలతో కవితను నిందితురాలిగా చేర్చారు. ఈ సారి ఇంటికి వచ్చి విచారణ జరిపే అవకాశం లేదు . ఢిల్లీ వెళ్లి హాజరు కావాల్సి ఉంటుంది.ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో సీబీఐ కానీ.. ఈడీ కానీ ఆషామాషీగా ఏమీ చేయడం లేదని.. ప్రణాళికాబద్ధంగానే చేస్తున్నారన్న అభిప్రాయాలు ఇలాంటి కేసుల్లో పండిపోయిన వారి అభిప్రాయంగా వినిపిస్తోంది. ముందు ముందు కవితకు ఈ కేసులో చిక్కులు పెరిగే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని అంటున్నారు. లిక్కర్ స్కామ్‌లో నిందితులుగా పేర్కొన్న అందర్నీ సీబీఐ అరెస్టు చేసింది. అందుకే.. ఇప్పుడు కవితను కూడా అరెస్టు చేసే అవకాశాలు ఉన్నాయన్న అభిప్రాయం వినిపిస్తోంది. అయితే కవిత విచారణకు వెళ్తారా లేదా అన్నది కీలకంగామారింది.

# విశాఖ తీరంలో ఘాజీ శకలాలు

**గుర్తించిన ఇండియన్ నేవీ**
**1971 భారత్-పాక్ యుద్ధ సమయంలో విశాఖ తీరం వరకు చొచ్చుకొచ్చిన పాక్ జలాంతర్గామి పీఎన్ఎస్ ఘాజీ**
**సముద్ర తీరానికి 2.5 కిలోమీటర్ల దూరంలో 100 మీటర్ల లోతున శకలాలు**
**డీఎస్ఆర్వీ సాంకేతిక సాయంతో గుర్తింపు**

**ఫిబ్రవరి 23(జర్నలిస్ట్ వార్త):**

1971 ఇండో-పాక్ యుద్ధ సమయంలో బంగాళాఖాతంలోకి విశాఖపట్టణం వరకుచొచ్చుకొచ్చి భారత్‌ను దొంగదెబ్బ తీయాలని ప్రయత్నించి చావుదెబ్బలు తిన్న పాక్ జలాంతర్గామి పీఎన్ఎస్ ఘాజీ శకలాలను భారత నౌకాదళం గుర్తించింది.




ఇండియన్ నేవీలోని సబ్‌మెరైన్ రెస్క్యూ విభాగం అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించి వీటిని గుర్తించింది. భారత అమ్ములపొదిలోకి ఇటీవల వచ్చి చేరిన 'ది డీప్ సబ్‌మెర్జెన్స్ రెస్క్యూ వెహికల్ (డీఎస్ఆర్వీ) సాయంతో ఈ శకలాలను కనుగొన్నారు. విశాఖపట్టణం తీరానికి దాదాపు 2.5 కిలోమీటర్ల దూరంలోని సముద్ర గర్భంలో 100 మీటర్ల లోతున శకలాలు ఉన్నట్టు గుర్తించారు. అయితే, యుద్ధంలో చనిపోయిన వారిని గౌరవించడం మన నౌకాదళ ఆచారం కావడంతో వాటిని తాకలేదని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు.2013లో ఐఎన్ఎస్ సింధ్‌రక్షక్ ప్రమాదానికి గురై 13 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో ఇలాంటి ప్రమాదాల సమయంలో సిబ్బందిని రక్షించేందుకు వీలుగా 2018లో తొలిసారి డీఎస్ఆర్వీ సాంకేతికతను అందుబాటులోకి తెచ్చారు. నౌకలు, జలాంతర్గాములు ప్రమాదానికి గురైనప్పుడు వాటిని గుర్తించి సహాయక చర్యలు చేపట్టేందుకు ఈ సాంకేతికతను ఉపయోగిస్తారు. ప్రస్తుతం నేవీ వద్ద రెండు డీఎస్ఆర్వీలు అందుబాటులో ఉన్నాయి. నౌకలు, విమానాల ద్వారా దీనిని తరలించవచ్చు. భారత్ సహా 12 దేశాల వద్ద మాత్రమే ప్రస్తుతానికి ఇలాంటి సాంకేతికత అందుబాటులో ఉంది. డీఆర్ఎస్వీ 650 మీటర్ల దిగువకు వెళ్లి పనిచేసే సామర్థ్యం ఉంది.

## బీబీసీ చైర్మన్ గా భారత సంతతి వ్యక్తి
# సమీర్ షా నియామకం

**ఫిబ్రవరి 23(జర్నలిస్ట్ వార్త):**




ప్రఖ్యాత మీడియా సంస్థ బీబీసీ (బ్రిటీష్ బ్రాడ్ కాస్టింగ్ కార్పొరేషన్) చైర్మన్ గా డాక్టర్ సమీర్ షా నియమితులయ్యారు. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు ఉన్న బీబీసీకి ఓ భారత సంతతి వ్యక్తి చైర్మన్ గా ఎంపికవడం ఇదే ప్రథమం. బ్రిటన్ రాజు చార్లెస్- బీబీసీ చైర్మన్ పదవి నియామకానికి కొన్ని రోజుల కిందట ఆమోద ముద్ర వేశారు. బీబీసీ చైర్మన్ గా సమీర్ షా పదవీకాలం మార్చి 4న మొదలవుతుంది. నాలుగేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగనున్న ఆయన ఏడాదికి రూ.1.68 కోట్ల వేతనం అందుకోనున్నారు. సమీర్ షా వయసు 72 సంవత్సరాలు. ఆయనకు సొంతంగా జూపిటర్ అనే టీవీ చానల్ ఉంది. టీడీ న్యూస్, జర్నలిజంలో ఆయనకు నాలుగు దశాబ్దాల సుదీర్ఘ అనుభవం ఉంది. సమీర్ షా గతంలో బీబీసీలో నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గానూ, కరెంట్ అఫైర్స్-పొలిటికల్ అఫైర్స్ విభాగం అధిపతిగానూ వ్యవహరించారు. పాత్రికేయ రంగానికి ఆయన అందించిన సేవలకు గుర్తుగా 2019లో బ్రిటన్ రాణి చేతుల మీదుగా కమాండర్ ఆఫ్ ద ఆర్డర్ ఆఫ్ ద బ్రిటీష్ ఎంపైర్ పురస్కారం అందించారు. సమీర్ షా స్వస్థలం మహారాష్ట్రలోని ఔరంగాబాద్. 1960లో బ్రిటన్ కు వలస వెళ్లారు.

# బీజేపీ ప్రజా సంకల్ప యాత్రను విజయవంతం చేయాలి


## - బీజేపీ ఎస్సీమోర్చా రాష్ట్ర అధ్యక్షులు కొండేటి శ్రీధర్



**వర్ధన్నపేట, ఫిబ్రవరి 23(జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామ శివారులోని లక్ష్మి ఫంక్షన్ హాల్లో బిజెపి మండల పార్టీ అధ్యక్షులు రాయపురపు కుమారస్వామి అధ్యక్షతన శుక్రవారం బిజెపి నేతలు సమావేశమైనారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపీ ఎన్నికల్లో భాగంగా బీజేపీ పార్టీ ప్రజా సంకల్ప యాత్రను ప్రారంభించబోతున్నట్లు తెలిపారు. దేశ వ్యాప్తంగా ప్రజలు మోడీ నాయకత్వాన్ని కోరుకుంటున్నట్లు తెలిపారు. ప్రపంచ దేశాల్లో భారతదేశం అగ్రగామిగా నిలవాలంటే మోడీ వల్లనే సాధ్యమవుతుందని ప్రజలు భావిస్తున్నట్లు వివరించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో 17 స్థానాలకు గాను 10 స్థానాలు బిజెపి పార్టీ సొంతం చేసుకుంటున్నట్లు ధీమా వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల దృశ్య బీజేపీ రాష్ట్ర నాయకత్వం చేపట్టిన ప్రజా సంకల్ప యాత్ర వరంగల్ జిల్లాలో ఈ నెల 29న ప్రారంభం కానుందని తెలిపారు. వరంగల్ లో నిర్వహించే ప్రజా సంకల్ప యాత్రకు కాకతీయ భద్రఖాళీ ప్రజా సంకల్పయాత్ర అని నామకరణం చేయడం జరిగిందన్నారు. ఈ యాత్రలో భాగంగా 29న సాయంత్రం 4 గంటలకు వర్ధన్నపేట అసెంబ్లీ నియోజకవర్గంలోని మడికొండ నుండి యాత్ర ప్రారంభం కానుందని చెప్పారు. మడికొండ, కడిపికొండ, తరాలపల్లి, ఐనవోలు, పున్నేలు మీదుగా యాత్ర కొనసాగుతున్నట్లు వెల్లడించారు. పున్నేలు క్రాస్ రోడ్డులో కార్నర్ సమావేశం ఉంటుందని తెలిపారు. అదేవిదంగా పంతిని, కట్ర్యాల, ఇల్లంద గ్రామాల మీదుగా బయలుదేరిన యాత్ర చివరిగా వర్ధన్నపేట పరిధిలో బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం యాత్ర పాలకుర్తి నియోజకవర్గంలోకి చేరుతుందని తెలిపారు. ఈ యాత్రకు ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి లేదా జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంపీ బండి సంజయ్ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. వర్దన్నపేట నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించే కాకతీయ భద్రాఖాళీ ప్రజా సంకల్ప యాత్రకు నియోజకవర్గం నుండి ప్రజలు, బీజేపీ శ్రేణులు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బన్న ప్రభాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి గాడిపెల్లి రాజేశ్వర్ రావు, నాయకులు కొండేటి సత్యం, పెద్దూరి రాజుకుమార్, ఐత రవికుమార్, మల్లెపాక అనిల్, కొండేటి బాబు తదితరులు పాల్గొన్నారు.

## పరకాల ప్రజలకు అమ్మవార్ల ఆశీర్వాదం ఉండాలి

### - సమ్మక్క సారలమ్మను మొక్కిన మాజీ ఎమ్మెల్యే చల్లా



**ఆత్మకూరు, ఫిబ్రవరి 23(జర్నలిస్ట్ వార్త):** ఆత్మకూరు మండలం అగ్రంపాడ్ గ్రామంలోని సమ్మక్క సారక్క అమ్మవార్లను శుక్రవారం పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి జ్యోతి దంపతులు కుటుంబ సమేతంగా దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా పరకాల నియోజకవర్గ ప్రజలకు అమ్మవార్ల ఆశీర్వాదం ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నారు. వారి వెంట స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## సమ్మక్క సారలమ్మను దర్శించుకున్న మంత్రి దుద్దిళ్ల

### - నిలువెత్తు బంగారం చెల్లింపు



**మేడారం, ఫిబ్రవరి 23(జర్నలిస్ట్ వార్త):** మేడారం సమ్మక్క సారలమ్మ అమ్మవార్లను శుక్రవారం ఐటీ పరిశ్రమలు శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి వర్యులు దుద్దిళ్ల శ్రీదర్ బాబు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు నిలువెత్తు బంగారం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. వారి వెంట స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు ఉన్నారు.

## పాతగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామికి వస్త్రాలు సమర్పించిన ఆలేరు ఎమ్మెల్యే దంపతులు



**యాదాద్రి, ఫిబ్రవరి 23(జర్నలిస్ట్ వార్త):** యాదాద్రిపాతగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయంలో బ్రహ్మోత్సవాలు నిర్వహించారు. శుక్రవారం స్వామివారి దర్శనం కోసం ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కుటుంబ సమేతంగా ఆలయానికి చేరుకున్నారు. కళ్యాణ మహోత్సవం సందర్భంగా స్వామివారికి, అమ్మవార్లకు ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అనిత దంపతులు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకున్న అనంతరం నర్సింహమూర్తి, ఈవో రామకృష్ణారావు, ఆలయ ప్రధాన అర్చకులు నల్లందిగల్ లక్ష్మీ నరసింహ చార్యులు, కాండూరి వెంకటాచార్యులు చేతుల మీదుగా దేవస్థాన డైరీని ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ యాదాద్రి శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారి ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్ర, ఆలేరు నియోజకవర్గ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని స్వామివారిని వేడుకున్నారు. వారి వెంట స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## మేడారం జాతర సమీపంలో పరిసరాలను శుభ్రం చేయాలి

మేడారం, ఫిబ్రవరి 23(జర్నలిస్ట్ వార్త): మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు భక్తుల రద్దీ క్రమక్రమంగా పెరుగుతుందని శుక్రవారం ధర్మ సమాజ్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కేడల ప్రసాద్ అన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వనదేవతల దర్శనం కోసం విచ్చేసిన భక్తులకు మౌలిక వసతుల కల్పనలో తెలంగాణ ప్రభుత్వం విఫలమౌతుందని ఓ ప్రకటన ద్వారా పేర్కొన్నారు. భక్తులకు త్రాగునీటి సమస్య సమస్యాత్మకంగా మారింది అన్నారు. మినరల్ వాటర్ బాటిళ్లు కొనుక్కుని త్రాగాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. జాతర సమీపంలో పేరుకుపోతున్న చెత్త, కోళ్ల, మేకల వ్యర్థాలు పేరుకు పోవడం వల్ల పరిసరాలు అపరిశుభ్రత వ్యాపించిందన్నారు. జాతరకు వచ్చి వెళుతున్న భక్త జనానికి దుర్వాసనలు వెలువడుతూ ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. తక్షణమే ఆలయ సిబ్బంది పరిశుభ్రత పనులు చేపట్టకపోతే భక్తులు భరించలేని ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన ప్రమాదం ఉందన్నారు. వివిధ ప్రాంతాల నుంచి ఇప్పటికి వన దేవతల దర్శనానికి వస్తున్నవారు పరిశు భ్ర వాతావరణంలో మొక్కులు చెల్లించుకునే విధంగా వారికి అవకాశం కల్పిస్తూ, మేడారం జాతర పరిసరాలను శుభ్రం చేయించాలని డిమాండ్ చేస్తున్నారు.

## రాయపర్తి ఎస్సైని సన్మానించిన ముస్లిం సోదరులు




రాయపర్తి, ఫిబ్రవరి 23(జర్నలిస్ట్ వార్త): ఇటీవల రాయపర్తి ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన సందీప్ కుమార్ ని శుక్రవారం ముస్లీం సోదరులు మర్యాదపూర్వకంగా కలిశారు. మజీద్ ఏ నూర్ సదర్ సాహెబ్ ఎండీ హుసేన్ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులు వారిని శాలువాతో సన్మానించారు. సన్మానించిన వారిలో మాజీ సదర్ అబ్దుల్ రహమాన్, రహీమ్, మహ్మద్ యూసుఫ్, ఇక్బాల్, మహ్మద్ రఫీ, మహ్మద్ మహమూద్, మహ్మద్ రజాక్, ఖాసీం, మహ్మద్ అక్బర్, రహమాన్, రియాజ్, వసీమ్, తదితరులు పాల్గొన్నారు.

## వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

### - వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్



వరంగల్, ఫిబ్రవరి 23(జర్నలిస్ట్ వార్త): గ్రేటర్ వరంగల్ హసన్ పర్తి మండల కేంద్రంలోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ 20వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఆలయ వార్షికోత్సవ వేడుకలకు ముఖ్య అతిథులుగా బిఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షులు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఈ వేడుకల్లో స్థానిక డివిజన్ కార్పొరేటర్, డివిజన్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మల్లన్న స్వామి హుండీ ఆదాయం లెక్కింపు



ఐనవోలు, ఫిబ్రవరి 23(జర్నలిస్ట్ వార్త): ఐనవోలు మండల కేంద్రంలోని మల్లన్న స్వామి దేవాలయంలో శుక్రవారం దేవాదాయ శాఖ వరంగల్ డివిజనల్ పరిశీలకులు జి. సంజీవరెడ్డి పర్యవేక్షణలో హుండీ ఆదాయం లెక్కించారు. ఆలయ కార్యనిర్వాహణ అధికారి అద్దంకి నాగేశ్వర్ రావు తెలిపిన వివరాల ప్రకారం తేది. 19.01.2024 నుండి తేది. 23.02. 2024 వరకు 35 రోజుల వ్యవధిలో హుండీ ద్వారా 44,46,004 రూపాయలు, వివిధ టికెట్స్ ద్వారా 1,32,02,165 రూపాయల ఆదాయం మొత్తం 1,76,48,169 రూపాయలు వచ్చాయన్నారు. హుండీలో వెలువడిన మిశ్రమ వెండి, బంగారం తిరిగి హుండీలో వేసినట్లు తెలిపారు. గత సంవత్సర ఆదాయానికి మించి 11, 35, 081 రూపాయల ఆదాయం ఎక్కువగా వచ్చినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఐనవోలు పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ రఘునారెడ్డి, మునిగాల రాజు, రాకేష్, మహబూబాబాద్ శ్రీలక్ష్మీ వేంకటేశ్వర సేవ సమితి సభ్యులు, దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



రాయపర్తి, ఫిబ్రవరి 23(జర్నలిస్ట్ వార్త): రాయపర్తి మండలం పెరికేడు గ్రామానికి చెందిన అయిత రామక్క ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. శుక్రవారం ఆమె దశదిన కర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ జాంబవ యువజన సంఘం సభ్యులు పాల్గొని బాధిత కుటుంబ సభ్యులకు 36 వందల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గారె కిరణ్, బిర్రు నాగరాజు, గారె రమేష్, తాటికాయల శ్రీనివాస్, గారె అనిల్, తాటికాయల సైదులు, గారె కృష్ణ, నక్క శేఖర్, గారె విజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబానికి 5వేల రూపాయల ఆర్థిక సహాయం



పెద్దపల్లి, ఫిబ్రవరి 23(జర్నలిస్ట్ వార్త): జూలపల్లి గ్రామం నిరుపేద కుటుంబానికి చెందిన వడ్లూరి చంద్రమౌళి తన కుమారునిపై చదువుల కొరకు ఆర్థిక పరమైన ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు. హాస్టల్ ఫీజు చెల్లించ లేక ఇబ్బందుల్లో ఉన్న వారి సమస్య తెలుసుకుని శుక్రవారం పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ఆదేశాల మేరకు దూళికట్ట సింగిల్ విండో చైర్మన్ పుల్లూరి వేణుగోపాల్ రావు ఆ కుటుంబానికి 5 వేల రూపాయల ఆర్థిక సాయం అందించారు. వారి వెంట యూత్ కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షులు మానుమండ్ల శ్రీనివాస్, అమరగాని సాయి గౌడ్, నెరువట్ల తేజురాజు, బెజ్జంకి సంతోష్, నెరువట్ల కిట్టయ్య, మొదుంపల్లి బుచ్చయ్య, మొదుంపల్లి గంగయ్య ఉన్నారు. ఈ సందర్భంగా చంద్రమౌళి కుటుంబ సభ్యులు వేణుగోపాల్ రావుకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ఎమ్మెల్యే లాస్యనందిత మృతి బాధాకరం

### - వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్



**వరంగల్, ఫిబ్రవరి 23(జర్నలిస్ట్ వార్త):** కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత అకాల మృతి పట్ల బిఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షులు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. చిన్న వయస్సులోనే ఎమ్మెల్యేగా ఎన్నికై, తన తండ్రి దివంగత మాజీ ఎమ్మెల్యే సాయన్న ఆశయాలను ముందుకు తీసుకుపోతూ, ప్రజల మన్ననలు పొందిన నందిత రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందడం బాధాకరమన్నారు. సంవత్సరం క్రితం సాయన్న మృతి చెందారు. ఇప్పుడు ఆయన కూతురు నందిత మృత్యువు ఒడిలోకి చేరడం విచారకరమని అన్నారు. శోకతప్తులైన సాయన్న కుటుంబ సభ్యులు, వారి బంధుమిత్రులకు అరూరి రమేశ్ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# ఎన్నికలప్పుడే కలిసే బాపతు

## ఇండియా కూటమిపై మోడీ

వారణాసి : ప్రధాని నరేంద్ర మోడీ శుక్రవారం కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీపై విరుచుకుపడ్డారు. తమ సొంత నియోజకవర్గం వారణాసిలో జరిగిన బహిరంగ సభలో ప్రధాని ప్రసంగించారు. ఒక నేతకు వారణాసి జనం, ఇక్కడి యువత అంటే బాగా అలుసు అని, అందుకే వారు వొళ్లు మరిచి ఏదేదో మాట్లాడుతుంటారని రాహుల్ గాంధీపై విమర్శలు గుప్పించారు. వారణాసిలో జనం బాగా మందుకొట్టి రోడ్లపై పడి దొర్లుతున్నారని రాహుల్ గతంలో చేసిన వ్యాఖ్యలపై మోడీ స్పందించారు. ఇటువంటి మాటలు మాట్లాడే వారికి కనీస విచక్షణ ఉందా? లేక వారు స్పృహకోల్పోయి ఇటువంటి మాటలకు దిగుతున్నారా? అని ప్రశ్నించారు. కాశీ (వారణాసి) పిల్లలు తాగుబోతులు అని అనే వారికి అసలు బుద్ధుందా? అని నిలదీశారు. హోష్‌లో లేని వారే ఇక్కడి యువతను నషేరీ అని ఎకసక్కాలకు దిగుతారని చెప్పారు. వారణాసికి ప్రధాని మోడీ గురువారం అర్ధరాత్రి వచ్చారు. శుక్రవారం ఇక్కడతమ పార్లమెంటరీ నియోజకవర్గంలో రూ 13,000 కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాల నేపథ్యంలో ఏర్పాటు అయిన బహిరంగ సభలో మాట్లాడారు.

పరివార్‌వాద్ , అవినీతి, కొన్ని వర్గాలకు రాయితీలతో ఉత్తరప్రదేశ్ పూర్తిగా దశాబ్దాల పాటు వెనుకబడిందని కాంగ్రెస్ ఇతర పార్టీల పాలనలపై విమర్శలు గుప్పించారు. ఇక కాంగ్రెస్ షాహీ పరివార్‌కు చెందిన వారు వారణాసి యువతను చులకన చేస్తున్నారని , వీరిని మద్యం తీసుకునే వారని అంటున్నారని రాహుల్‌ను దృష్టిలో పెట్టుకుని స్పందించారు. యువరాజులు ఇక్కడికి వచ్చి ఏదేదో వాగిపోతూ ఇక్కడి యువతను కించపర్చడం భావ్యమేనా? అని ప్రశ్నించారు. ఆయన వాడే భాష ఏమిటీ? వారు రెండు దశాబ్దాలుగా మోడీని తిట్టిపోస్తూ వచ్చారని, ఇప్పుడు మరింత దిక్కుతోచని స్థితికి వచ్చిన వాడై యువరాజు ఇక్కడికి వచ్చి ఏకంగా యుపి యువజనంపై తమ నిస్పృహ వ్యక్తం చేస్తున్నారని విమర్శించారు. ఇండియా కూటమి ఇక్కడి యువతను అవహేళన చేయడాన్ని తాను ఎప్పటికీ క్షమించేది లేదన్నారు. కించపరిచేలా మాట్లాడటం ప్రత్యేకించి





వారణాసి యువతరానికి కళంకం ఆపాదించడం వారి నిజమైన ముసుగు. వారి రూపం. ఇటువంటి వారు కుటుంబ కోణంలోనే ఆలోచిస్తూ ఉంటారని , యువత ప్రతిభ అంటే వారికి మంట అని విమర్శించారు.

ఇండియా కూటమికి ఇప్పుడు కాశీ, అయోధ్య కొత్త రూపం చూసి నిద్రపట్టడం లేదని వ్యాఖ్యానించారు. ఇక్కడి ప్రగతి వారి కంటపడదు. కానీ ఇక్కడి వారిని ఏదో విధంగా అవమానించడం అలవాటు అయిందని విమర్శించారు. కాంగ్రెస్ వల్లనే ఉత్తరప్రదేశ్ ఎన్నో ఏళ్లుగా వెనుకపడిందని తెలిపారు. అర్ధరాత్రి తరువాత వారణాసికి వచ్చిన మోడీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యానాథ్‌తో కలిసి ఈ పుణ్యస్థలంలో నిర్మించిన కొత్త రాదారి నాణ్యతను పూర్తి స్థాయిలో తనిఖీ చేశారు. శివ్‌పుర్ పుల్‌వరియా, లహ్రతారా మార్గ్‌పై కలియతిరిగారు. ఆయన వెంట కేవలం ఒక్క ఆదిత్యానాథ్ ఉన్నారు. సంబంధిత ఫోటోలు సామాజిక మాధ్యమంలో వెల్లువెత్తాయి. అంతకు ముందు రాత్రిపూటనే కాశీ వీధులలో రోడ్‌షో నిర్వహించారు.

తాను స్థానిక కుటీరపరిశ్రమలను ప్రోత్సహిస్తానని, లోకల్ కోసం నినదిస్తానని చెపుతూ సన్నకారు రైతులను, సంస్థల కోసం వాదించేవాడినని తెలిపిన మోడీ తనను వీరి ప్రచారకర్తగా భావించవచ్చునని , స్థానికంగా ఉండే చేతివృత్తుల వారిని ఎక్కడికక్కడ ప్రోత్సహించాల్సి ఉందన్నారు.

ఎన్నికలు సమీపిస్తున్న దశలో ప్రధాని మోడీ వారణాసి బహిరంగ సభలో విపక్ష ఇండియా కూటమిపై నిప్పులు చెరిగారు. కొందరు ఎన్నికలప్పుడు ఒకే వేదికపైకి వస్తుంటారు. ఎన్నికల్లో ఫలితాలు దక్కకపోవడంతో , ఎవరికి వారే అవుతారు. తిరిగి ఒకరిపై ఒకరు తిట్లకు దిగుతుంటారని అన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై తనకు అపార విశ్వాసం ఉందని, ఈసారి ప్రజానాడి అంతా కూడా మోడీ గ్యారంటీలకు సానుకూల ముద్రతో ఉందన్నారు. ఇక ఉత్తరప్రదేశ్‌లో సీట్లన్ని కూడా ఎన్‌డిఎకు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. తనకు సంబంధించినంత వరకూ మూడో దఫా అధికారం మరింత అలుపెరుగనిది అని తేల్చిచెప్పారు.

ఈ పది సంవత్సరాలలో తాను వారణాసి ఎంపిగా ఉన్నానని, కాశీతో సంబంధాలు పెరిగాయని, తాను బనారసిని అయ్యానని చమత్కరించారు. ఇక్కడి వాడిగా గుర్తింపు పొందినందున తాను ఇక్కడి కాశీపౌరుల జీవనస్థితిగతులను మరింత మెరుగుపర్చే దిశలో పాటుపడుతానని, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యానాథ్ ఇతరులు కూడా హాజరయిన సభలో హర్షధ్వానాలనడుమ తెలిపారు.

## లైంగిక దాడి కేసులో కలకత్తా హైకోర్టు తీర్పుపై స్పందించిన సుప్రీంకోర్టు

**ఫిబ్రవరి 23(జర్నలిస్ట్ వార్త):**

బాలికలు తమ లైంగిక వాంఛలను అదుపులో పెట్టుకోవల్సి ఉంటుందని కలకత్తా హైకోర్టు వెలువరించిన తీర్పు వివాదాస్పదం అయింది. దీనిపై అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తనంత తానుగా స్పందించి, సుమోటోగా విచారణకు స్వీకరించింది. ఈ విషయంపై తమ విచారణ మే నెల రెండవ తేదీన నిర్వహిస్తామని న్యాయమూర్తులు అభయ్ ఎస్ ఓకా, ఉజ్వల్ భూయాన్‌తో కూడిన ధర్మాసనం శుక్రవారం తెలిపింది. ఓ లైంగిక దాడి కేసులో కలకత్తా హైకోర్టు తీర్పులో వెలువరించిన వ్యాఖ్యలను సుప్రీంకోర్టు తీవ్రంగా పరిగణనలోకి తీసుకుంది. 2023 అక్టోబర్ 18వ తేదీన వెలువరించిన హైకోర్టు తీర్పుపై పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం కూడా అప్పీలు చేసుకుంది.మే 3వ తేదీనే ఈ పిటిషన్‌పై కూడా విచారణ ఉంటుందని సుప్రీంకోర్టు ధర్మాసనం తెలిపింది. హైకోర్టు వ్యాఖ్యలను డిసెంబర్ 8న ధర్మాసనం తప్పుపట్టింది. హైకోర్టు వ్యాఖ్యలు పూర్తిగా అభ్యంతరకరం, అవాంఛనీయం అని తెలిపారు. ఇప్పుడు ఈ వ్యాఖ్యలకు సంబంధించి సుప్రీంకోర్టు తనకు తానుగా పిటిషన్ ప్రక్రియను అసాధారణ రీతిలో చేపట్టింది. “యుక్తవయస్సుకు వచ్చిన మహిళలు కోరికలను అదుపులో పెట్టుకోవాలి. రెండు నిమిషాల స్వల్పకాలిక సుఖం అనుభవించే స్వేచ్ఛ ఆమెకు దక్కితే చివరికి నష్టపొయ్యేది ఎవరు? ఆమెనే’ అని కలకత్తా హైకోర్టు వ్యాఖ్యానించింది. లైంగిక దాడి కేసులో 20 సంవత్సరాల జైలుశిక్ష పడ్డ వ్యక్తి పెట్టుకున్న పిటిషన్‌పై విచారణ క్రమంలో హైకోర్టు స్పందించింది. శిక్ష పడ్డ వ్యక్తిని నిర్దోషిగా ప్రకటించింది.

## రిటైర్డ్ ఐఏఎస్ అధికారి జన్నత్ హుస్సేన్ మృతిపై సిఎం రేవంత్ రెడ్డి సంతాపం





**ఫిబ్రవరి 23(జర్నలిస్ట్ వార్త):**

రిటైర్డ్ ఐఏఎస్ అధికారి జన్నత్ హుస్సేన్ మృతి పట్ల సిఎం రేవంత్ రెడ్డి సంతాపం ప్రకటించారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రిన్సిపల్ చీఫ్ సెక్రటరీగా పని చేసిన జన్నత్ హుస్సేన్ తెలుగు రాష్ట్రానికి సుధీర్ఘ సేవలు అందించారని సిఎం గుర్తు చేసుకున్నారు. జన్నత్ హుస్సేన్ మృతి పట్ల ముఖ్యమంత్రి విచారం వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.జన్నత్ హుస్సేన్ ఉమ్మడి రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించారు. వైఎస్ఆర్ సిఎంగా ఉన్న సమయంలో సిఎం ప్రిన్సిపల్ సెక్రటరీగా పని చేసి స్పెషల్ సిఎస్ హెూదాలో రిటైరయ్యారు. తర్వాత సమాచార హక్కు చట్టం చీఫ్ కమిషనర్ గా పని చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం 2004లో అమల్లోకి తెచ్చిన ఉచిత విద్యుత్ పథకం విధి, విధానాలను రూపొందించి రైతులకు మేలు చేయటంలో ఆయన విశేషంగా కృషి చేశారు.

# భక్తులందరిపై సమక్క-సారలమ్మల దీవెనలు

### - అందరి సహకారంతో జాతర విజయవంతం

### -రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

**ఫిబ్రవరి 23(జర్నలిస్ట్ వార్త):**

దక్షిణ తెలంగాణ కుంభమేలా మేడారం సమ్మక్క సారలమ్మ మహా జాతరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 110 కోట్ల నిధులు కేటాయించి అభివృద్ధి కోసం ఎప్పటికప్పుడు తమను ప్రోత్సహించారని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు.జాతర ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్, ఎస్పీ సహకారంతో నిరంతరం కృషి చేసిన ఇతర జిల్లా యంత్రాంగం మొత్తాన్ని శుక్రవారం సీతక్క అభినందించారు. ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా అధికారులందరూ ఎప్పటికప్పుడు అప్రమత్తమై జాతర నిర్వహణను విజయవంతం చేశారన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎల్లకాలం ప్రజలకు అందుబాటులో ఉండి పనిచేస్తామని ఆమె పేర్కొన్నారు. సమ్మక్క సారలమ్మల దీవెనలు ప్రజలందరికి ఉండాలని, మంచి ఆరోగ్యం, వారి కుటుంబానికి సంక్షేమం ఇవ్వాలని కోరుతున్నట్లు ఆమె తెలిపారు.అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. తెలంగాణలోనే అతిపెద్ద జాతర ప్రతి రెండు సంవత్సరాలకొకసారి జరుగుతుందని అన్నారు. అమ్మవార్లపై విశ్వాసంతో రానురాను ఈ జాతరకు భక్తులు పెరుగుతున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని జాగ్రత్తలు, అలాగే విఐపిల దర్శనాలకు అన్ని చర్యలు తీసుకుంటూ మంత్రి సీతక్క ఎంతో కృషి చేశారన్నారు. ఈ జాతర నిర్వహణ మొత్తం ఐటీడీఏ పరిధిలో జరుగుతుందని తెలిపారు. అలాగే జాతర నిర్వహణకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే 110 కోట్లు విడుదల చేసి కావాల్సిన అన్ని సహాయ



సహకారాలు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమాచార, పౌరసంబంధాలు, రెవిన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) శ్రీజ, దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ సునీల్ కుమార్, ఐటీడీఏ పీవో అంకిత్ కుమార్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు

**వనదేవతలను దర్శించుకోవడం సంతోషకరం**

గవర్నర్ తమిళిసై సౌందరరాజన్

గిరిజన కుంభమేలా మేడారం మహా జాతరలో గవర్నర్‌గా మూడోసారి పాల్గొనడం చాలా సంతోషాన్ని ఇచ్చిందని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ అన్నారు. శుక్రవారం ఆమె కేంద్ర గిరిజన మంత్రి అర్జున్ ముండాతో కలిసి మేడారం మహా జాతరలో సమ్మక్క సారలమ్మ అమ్మవార్లను దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా గవర్నర్ దంపతులు, కేంద్ర గిరిజన మంత్రికి రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క , ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబు ఘన స్వాగతం పలికారు. అనంతరం మీడియా సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గవర్నర్ మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్రంలోని ప్రజలందరూ ముఖ్యంగా గిరిజనులు సంతోషంగా, ప్రశాంతంగా, ఆరోగ్యవంతంగా ఉండాలని అమ్మవారిని కోరుకున్నానని తెలిపారు.



## మేడారం మహాజాతరపై కేంద్రానికి ఎందుకింత వివక్ష?

### సీఎం రేవంత్‌రెడ్డి

**ఫిబ్రవరి 23(జర్నలిస్ట్ వార్త):**




మేడారం మహాజాతరపై కేంద్ర ప్రభుత్వానికి ఎందుకింత వివక్ష అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. మంత్రి సీతక్క కృషితో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్ర పండుగగా మేడారం జాతరను ప్రకటించారని గుర్తుచేశారు. కుంభమేళాను కేంద్ర ప్రభుత్వం జాతీయ పండుగగా గుర్తించినప్పుడు.. సమ్మక్క-సారలమ్మ జాతరను గుర్తిస్తే తప్పేంటీ అని నిలదీశారు. దక్షిణాది కుంభమేళాకు ప్రాముఖ్యం ఇచ్చినప్పుడు.. మేడారం జాతరను కేంద్రం ఎందుకు విస్మరిస్తుందని ప్రశ్నించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హెూంమత్రి అమిత్ షా జాతరకు రావాలని కోరారు. మేడారం జాతరలో సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం నాడు పాల్గొని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. సీఎంకు అతిథి మర్యాదలతో సత్కరించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ... సమ్మక్కను దర్శనం చేసుకోకపోవడం వల్లే మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మూల్యం చెల్లించుకున్నారని.. బీజేపీకి కూడా అదేగతి పడుతుందని హెచ్చరించారు. అయోధ్యలో రాముడిని మాత్రమే కాదని.. మేడారం సమ్మక్క – సారక్కల దర్శనానికి రావాలని కోరారు. బీజేపీ – బీఆర్ఎస్ చీకటి ఒప్పందాలను త్వరలో బయట పెడతామని వార్నింగ్ ఇచ్చారు. ఏడు సీట్లు బీఆర్ఎస్‌కు.. పది సీట్లు బీజేపీకు అని రెండు పార్టీల్లోని అగ్ర నేతలు చీకటి ఒప్పందాలు చేసుకుంటున్నారని అన్నారు. త్వరలోనే వారి చీకటి ఒప్పందాలు బయట పెడతామని హెచ్చరించారు.



# సాగరనగరంలో రెండు ఐపీఎల్ మ్యాచ్ లు



ఫ్రూా% 2024: విశాఖ నగరవాసులకు శుభవార్త. నగరంలో ఐపీఎల్ మ్యాచ్లు జరగనున్నాయి. ఈ మేరకు ఐపీఎల్ షెడ్యూల్లో విశాఖలోని ఏసిఏ-వీడిసిఎ స్టేడియం కు చోటు దక్కింది.అంతర్జాతీయ ప్రమాణాల స్థాయిలో ఇక్కడ స్టేడియం ఉన్నా అంతర్జాతీయ మ్యాచులు నిర్వహించడం అంతంత మాత్రమే. చివరిసారిగా నాలుగేళ్ల కిందట ఇక్కడ ఐపీఎల్ మ్యాచ్లు జరిగాయి. తాజా సీజన్లో రెండు మ్యాచ్లకు అవకాశం దక్కింది. దీంతో క్రీడాభిమానుల్లో సందడి నెలకొంది.నగర శివారులోని పోతినమల్లయ్యపాలెంలో ఈ స్టేడియం ఉంటుంది. జాతీయ రహదారి పక్కన ఉండే ఈ గ్రౌండ్ క్రికెట్ అభిమానుల మదిని దోచుకుంటుంది. నాలుగేళ్ల కిందట ఐపీఎల్ మ్యాచ్లకు ఆతిథ్యం ఇచ్చింది. 2012లో డెక్కన్ చార్జర్స్, 2015లో సన్రైజర్స్ హైదరాబాద్, 2016లో ముంబై ఇండియన్స్ జట్లు ఆడిన గ్రూప్ స్టేజ్ మ్యాచ్లకు వేదిక అయింది. 2019లో ఐపీఎల్ గ్రూప్ స్టేజ్ మ్యాచులు లేకపోయినా.. కీలకమైన ఎలిమినేటర్, క్వాలిఫైయర్ 2 మ్యాచ్లకు ఆతిథ్యం ఇచ్చింది.తాజా ఐపిఎల్ షెడ్యూల్లో భాగంగా







విశాఖలో రెండు మ్యాచ్లు జరగనున్నాయి. మార్చి 31న ఢిల్లీ క్యాపిటల్స్-చెన్నై సూపర్ కింగ్స్, ఏప్రిల్ 3న ఢిల్లీ క్యాపిటల్స్-కోల్కత్తా నైట్ రైడర్స్ మధ్య మ్యాచ్ జరగనుంది. విశాఖలో జరిగే మ్యాచ్లకు ఉత్తరాంధ్రతో పాటు ఒడిస్సా, చత్తీస్ ఘడ్ ల నుంచి క్రికెట్ అభిమానులు తరలివస్తుంటారు. ఎప్పుడు అంతర్జాతీయ మ్యాచ్లు జరిగిన టిక్కెట్లు హాట్ కేకుల అమ్ముడు అవుతాయి. ఈసారి కూడా సమ్మర్ లో ఐపీఎల్ మ్యాచ్ టికెట్లకు గిరాకీ ఖాయమని క్రికెట్ వర్గాలు చెబుతున్నాయి.



# ముగిసిన తొలిరోజు ఆట.. ఇంగ్లండ్ 302/7

భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య జరుగుతున్న నాలుగో టెస్టు మొదటి రోజు ఆట ముగిసింది. ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ స్కోరు 90 ఓవర్లలో 302/7. ప్రస్తుతం జో రూట్ (106లి), ఆలీ రాబిన్సన్ (31లి) క్రీజులో నాటౌట్గా ఉన్నారు.తొలుత బ్యాటింగ్కు దిగిన ఇంగ్లండ్ కేవలం 112 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయింది. అయితే, రూట్ బెన్ ఫోక్స్తో కలిసి అద్భుతమైన భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. ఇంగ్లాండ్ను తిరిగి ఆటలోకి తీసుకువచ్చాడు. భారత్ తరఫున ఆకాశ్ దీప్ మూడు వికెట్లు తీయగా, మహ్మద్ సిరాజ్ రెండు వికెట్లు తీశాడు. వీరితో పాటు రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజా ఒక్కో వికెట్ తీశారు.

# అయ్యగారి న్యూ లుక్.. కొత్త ప్రాజెక్ట్ కు రెడీ!



అక్కినేని ప్రిన్స్ అఖిల్ నటించిన ఒక్క మూవీ కూడా ఇప్పటి వరకు బాక్సాఫీస్ వద్ద పెద్ద హిట్ కాలేదు. ఎంతో కష్టపడి చేసిన ఏజెంట్ మూవీ బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్ గా మిగిలింది. హార్డ్ వర్కౌట్స్ చేసి ఈ సినిమా కోసం మెయింటైన్ చేశారు అఖిల్. అయితే ఏజెంట్ మూవీ తర్వాత అక్కినేని అబ్బాయి సైలెంట్ అయిపోయారు. ఎక్కడా ఈవెంట్స్ లో పెద్ద కనిపించడం లేదు. ఆ మధ్య జరిగిన పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటించిన సలార్ మూవీ సక్సెస్ పార్టీలో సడెన్ గా కనిపించారు. దీంతో సలార్ రెండో పార్ట్ లో అఖిల్ నటిస్తున్నారని, దేవాకు తమ్ముడిగా కనిపిస్తారని వార్తలు తెగ చక్కర్లు కొట్టాయి. మరోవైపు, అఖిల్ తన నెక్స్ట్ మూవీ కోసం కొత్త దర్శకుడితో చేతులు కలపనున్నట్లు ఎప్పటి నుంచో వార్తలు వస్తున్నాయి. కానీ ఈ సినిమా పట్టాలెక్కడానికి మాత్రం ఇంకా చాలా టైమ్ పడుతుందట. దీంతో అసలు అఖిల్ ఎందుకు అలా లేట్ చేస్తున్నారని టాలీవుడ్ లో టాక్ నడుస్తోంది. కానీ ఆయన మాత్రం ఈ సారి ఎలా అయినా హిట్ కొట్టాలని ఫిక్స్ అయ్యారట. అందుకోసం స్లోగా, స్టడీగా కొత్త ప్రాజెక్ట్ పనులు కానిచేస్తున్నారట. పీరియాడిక్ జోనర్ లో ఆ సినిమా తెరకెక్కనుందట. దీంతో ఖర్చు కూడా ఎక్కువ పెట్టాల్సి ఉంటోంది. ఈ ప్రాజెక్ట్ ప్రీ ప్రొడక్షన్ కు కావాలనే ఎక్కువ టైం తీసుకుంటున్నారట మేకర్స్. ఇదిలా ఉంటే.. అఖిల్ లేటెస్ట్ పిక్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. వైట్ టీ షర్ట్ లో ఉన్న అఖిల్.. తన ఫ్రెండ్ తో దిగిన ఫొటో నెట్టింట చక్కర్లు కొడుతోంది. అందులో అఖిల్ ఫుల్ గడ్డంతో రగ్డ్ లుక్ లో కనిపిస్తున్నారు. దీంతో కొత్త సినిమాలో అఖిల్ లుక్ ఇదేనని ఫ్యాన్స్ కామెంట్లు పెడుతున్నారు.

# శ్రీవల్లి 2.0 అంతకు మించి...!

అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న పుష్ప 2 పై అంచనాలు భారీగా ఉన్నాయి. మొదటి పార్ట్ లో నటనకు గాను అల్లు అర్జున్ జాతీయ అవార్డును సొంతం చేసుకున్న విషయం తెల్సిందే. పుష్ప 2 లో అల్లు అర్జున్ అంతకు మించి అన్నట్లుగా నటిస్తున్నాడని, ఆయన పాత్రను అద్భుతంగా దర్శకుడు సుకుమార్ డ ఇజైన్ చేశాడని వార్తలు వస్తున్నాయి. ఇన్ని రోజులుగా హీరోయిన్ శ్రీవల్లి పాత్ర గురించి పెద్దగా చర్చ జరగలేదు. కానీ తాజాగా చిత్ర యూనిట్ సభ్యుల నుంచి అందుతున్న లీక్ అనుసారం పుష్ప 2 లో శ్రీవల్లి పాత్ర కు చాలా ప్రాముఖ్యత ఉంటుందట. నటనకు ఆస్కారం ఉన్న పాత్ర లో ఆమె కనిపించబోతుందని యూనిట్ సభ్యులు చెబుతున్నారు. మొదటి పార్ట్ లో కేవలం గ్లామర్ రోల్ కే పరిమితం అయ్యింది. అయితే రెండో పార్ట్ లో గర్భవతిగా కనిపించబోతుందని, తల్లి సెంటిమెంట్ సన్నివేశాల్లో కూడా ఆమె కనిపించబోతుందనే వార్తలు వస్తున్నాయి. మొత్తానికి శ్రీవల్లి ని మొదటి పార్ట్ తో పోల్చితే అంతకు మించి అన్నట్లుగా పుష్ప 2 లో ఉండబోతుందట. యానిమల్ సినిమాలో రష్మిక మందన్న పాత్ర కు మంచి మార్కులు దక్కాయి. ఆ సినిమాలో రష్మిక నటన విమర్శకుల ప్రశంసలు దక్కించుకుంది. అందుకే దర్శకుడు సుకుమార్ పుష్ప 2 లో కూడా ఆమె నటనతో ప్రేక్షకులను సర్ ప్రైజ్ చేసే విధంగా ప్లాన్ చేస్తున్నాడనే వార్తలు వస్తున్నాయి. రష్మిక మందన్న ఈ మధ్య కాలంలో వరుసగా పాన్ ఇండియా ప్రాజెక్ట్ లతో బిజీ అవుతోంది. పుష్ప తో పాన్ ఇండియా స్థాయిలో ఆకట్టుకున్న రష్మిక పుష్ప 2 తో మరింతగా స్టార్ డమ్ దక్కించుకోవడం ఖాయం. పుష్ప 2 సూపర్ హిట్ అయితే రష్మిక తన పారితోషికంను భారీగా పెంచే అవకాశాలు ఉన్నాయి.



# సుశాంత్ సింగ్ మృతి కేసు.. రియా చక్రవర్తికి భారీ ఊరట



బాలీవుడ్ నటుడు సుశాంత్ సింగ్ రాజ్ పుత్ మృతి కేసులో సినీ నటి రియా చక్రవర్తికి, ఆమె కుటుంబ సభ్యులకు పెద్ద ఊరట లభించింది. వీరిపై సీబీఐ జారీ చేసిన లుకౌట్ సర్క్యులర్ ను బాంబే హైకోర్టు రద్దు చేసింది. తాము సుప్రీంకోర్టులో అప్పీల్ చేసుకునేందుకు ఈ ఆర్డర్ పై నాలుగు వారాల పాటు స్టే విధించాలన్న సీబీఐ తరపు న్యాయవాది విన్నపాన్ని హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం తిరస్కరించింది. 2020 జూన్ 14న ముంబైలోని తన నివాసంలో సుశాంత్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. అయితే సుశాంత్ ది ఆత్మహత్య కాదని... రియా చక్రవర్తి, ఆమె కుటుంబ సభ్యులపై ఆరోపణలు చేస్తూ సుశాంత్ కుటుంబ సభ్యులు కేసు పెట్టారు. సుశాంత్ బ్యాంకు ఖాతా నుంచి రూ. 15 కోట్లు బదిలీ చేసుకున్నారంటూ ఆయన తండ్రి కేకే సింగ్ ఆరోపించారు.

# 26 నుంచి విశ్వంభరుడి విశ్వరూపం!



మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా వశిష్ట దర్శకత్వంలో 'విశ్వంభర' తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే కొన్ని కీలక షెడ్యూల్స్ పూర్తి చేసారు. మారుడుమిల్లి..హైదరాబాద్ సహా పలు ప్రాంతాల్లో కీలక సన్నివేశాలు చిత్రీకరించారు. ఇక హైదరాబాద్ లో భాగంగా ఏకంగా 13 ప్రత్యేకమైన సెట్లు నిర్మించి అక్కడా కొంత భాగం షూటింగ్ చేసారు. ఆ సెట్ల కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేసారు. సోషియా ఫాంటసీ చిత్రం కావడంతో మాయావనం లాంటి సెట్లు నిర్మించి అక్కడే ప్రత్యేకమైన సన్ని వేశాలు చిత్రీకరించారు. అయితే ఇంకా చాలా సెట్స్ లో షూటింగ్ చేయాల్సి ఉంది. ఈనేపథ్యంలో చిత్ర యూనిట్ విరామం ప్రక టించిన సంగతి తెలిసిందే. దీంతో చిరంజీవి అమెరికాకి వెకేషన్ కి వెళ్లి తిరిగొ చ్చారు. దీంతో కొత్త షె డ్యూల్ కి యూనిట్ సన్నాహాలు చేస్తోంది. ఈనెల 26 నుంచి హైదరాబాద్ లో కొత్త షెడ్యూల్ ప్రారంభమ వుతుంది. ఇందులో చిరంజీవితో పాటు కీలక నటులంతా పాల్గొంటారని తెలుస్తోంది. స్టోరీ డిమాండ్ మేరకు మరో ఐదుగురు భామలు ఉన్నట్లు తెలుస్తోంది. దీనిలో భాగంగా ఇషాచావ్లా..సురభి లను ఎంచుకున్నట్లు సమాచారం. తాజా షెడ్యూల్స్ చిరంజీవితో పాటు వాళ్లు కూడా పాల్గొనే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇప్పటికే చిరుకి జోడీగా త్రిషని తీసుకున్న సంగతి తెలిసిందే. ఆమె కూడా షూట్ లో భాగమవుతుంది. తాజా షెడ్యూల్ అంతా రంగులమయంగానే హైలైట్ అవుతుందని చెప్పొచ్చు. అలాగే కొన్ని కీలకమైన పోరాట సన్నివేశాలు ఈ షెడ్యూల్ లో చిత్రీకరించనున్నట్లు సమాచారం. అందు కోసం ప్రముఖ స్టంట్ మాస్టర్లని రంగంలోకి దించుతున్నారుట. చిరంజీవి ఇటీవల వర్కౌట్ చేసిన వీడి యోలు నెట్టింట వైరల్ అయిన సంగతి తెలిసిందే. ఆ వర్కౌట్లు అన్ని ఈ కొత్త షెడ్యూల్ లో షురూ చేయబో తున్నారని తెలుస్తోంది. ఈ చిత్రాన్ని యూవీ క్రియేషన్స్ భారీ బడ్జెట్ తో నిర్మిస్తోన్న సంగతి తెలిసిందే.